


# చిరంజీవి సిసింద్రీ

– ఇచ్ఛాపురపు రామచంద్రం

## దీపావళి!

కార్యాలయాలకి, కళాశాలలకి శలవు పండగ – రాత్రికి.

పొద్దున్నే పనేమీ లేక మా సుపుత్రుణ్ణి పిలిచాను. వాడి ఇంటర్ చదువెలా వుందో చూద్దామని. పది గంటలైనా కాకుండా రోడ్డు మీదేం పడేదీ?

"బాబ్జీ! నీకు ఫస్ట్ క్లాసొస్తుందిలే. కాని – అది చాలదు. ఎమ్ సెట్‌లో మంచి రాంక్ రావాలి. అప్పడే మంచి ఫ్యూచరు" అన్నాను బుజ్జగింపుగా.

"నా కంత కెపాకిటీ వుందంటారా?" సందేహం వెలిబుచ్చాడు వాడు.

త్రుళ్ళిపడ్డాను. "కెపాకిటీ కాదు. కెపాసిటీ" కిని సిని నొక్కి పలికాను.

"వెలాకిటీ సారలాగే చెప్పారు"

నివ్వెరపోయాను. "వెలాకిటీ సారెవరు?"

"ఫిజిక్స్ సారు"

"నువ్వు సరిగా విని వుండవు. ఒక లెక్చరరు – అలా ఎందుకు చెబుతారు?"

"కాలేజీలో సర్కంఫరెన్సెస్ ఏమీ బాగులేవు. ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు"

సర్కంఫరెన్సెస్ కావు... సర్కమెస్టాన్సెస్ అని సవరించడానికి నాకు నోరు పెగలలేదు.

వీడికెప్పుడూ ఫస్ట్‌క్లాస్ మార్కులే! స్టాండర్డేమో యిది! ఎలా వొచ్చి పడిపోతున్నాయి అన్నేసి మార్కులు? నర్సరీ నుంచీ ఇంగ్లీష్ మీడియమే. నవ్వడమూ ఏడవడమూ కూడా యింగ్లీషులోనే నేర్పే ప్రసిద్ధ కాన్వెంట్. మరి – ఇన్నేళ్ళు ఇంగ్లీషు చదివినా ఈ పదాల పారపా

ట్లేమిటీ! ఈ ఉచ్చారణేమిటి? వాళ్ళేం చెబుతున్నారు? వీడేం నేర్చుకుంటున్నాడు? విద్యాస్థాయి ఇంత దిగజారిపోయిందా నిజంగా?

మనసు వికలమయింది.

మావాడి భవిష్యత్తుని తలుచుకుంటూంటే భయం వేసింది. వీడి మీదా వీడి చదువు తీరు తెన్నుల మీదా వొళ్ళు మండింది.

ఓటికుండకు మోత ఎక్కువని. వొట్టి గొడ్డుకి అరుపులెక్కువని – ఈ చదువుకా అటు కాలేజీ... యిటు ట్యూషన్లూ... బోలెడన్ని పుస్తకాలూ... బోలెడంత ఖర్చూనూ!

రేపు వీళ్ళకేం ఉద్యోగాలొస్తాయ్? వొచ్చినా ఈ వొచ్చీరాని చదువుతో దేశానికీ ప్రజలకీ ఏముపయోగపడగలరు?

'మణిమాణిక్యాలను పోగొట్టుకున్నా మళ్ళీ సంపాదించుకోగలమేమోకాని – ముని మాణిక్యాలను కోల్పోతే మళ్ళీ సంపాదించుకోలేదు జాతి' అంటూండేవాడొక మిత్రుడు. ఈ మిడిమిడి మీడియం చదువులలో పడి అటు ఇంగ్లీషూ... ఇటు తెలుగూ ఏదీ రాకుండా రెండిటికీ చెడ్డ రేవళ్ళవుతున్నారా కుర్రాళ్ళు?

మా అబ్బాయిని చూస్తుంటే నీరసమూ నిరాశా నిస్పృహా వొచ్చేస్తున్నాయి. పుణ్యానికి పోతే పాపమెదురయిందని – వాడి చదువెలా వుందో చూద్దామనుకున్నందుకు నాకు చింతే మిగిలింది. రాత్రి రావలసిన అమావాస్య – పొద్దున్నే కమ్మేసింది మనసుని. కొందరికి మంచి పనులు కూడా కలసిరావు కాబోలు. పండగ పూట అబ్బాయీ నేనూ పరితపించడమెందుకులే అని పుంభావ సరస్వతి ముఖం చూడలేకా.... వీడికి నా ముఖం చూపించలేకా పలాయన వాదం చిత్తగిస్తూ పనుందని రోడ్డున పడ్డాను వేగంగా. ఇంటికంటే వీధి పదిలం కదా యిటువంటి సందర్భాలలో?

అబ్బాయిగారి అమోఘ విద్యాస్థాయికి మనసు వికలమై, మతిపోవడంతో వొంటి మీదా సిగరెట్ల మీదా స్పృహ కోల్పోయిన సంగతి ఆ షాపుని చూసేవరకూ తట్టలేదు. సిగరెట్‌గత ప్రాణిని నేను. అది – బేకరీకమ్ ఫ్యాన్సీ కమ్ సిగరెట్ షాప్. ఆలోచనలలోనే నడిచానటువైపు. అక్కడ –

నా ఆలోచనలనూ ఆవేదననూ ఆగమన్నట్లే –

"డాడీ!" ఆజ్ఞాపిస్తున్నట్లే అందమైన పిలుపు. అటు వైపు చూశాను.

మూడేళ్ళు దాటిన ముద్దులపాపకి. బాబ్‌డ్ హెయిర్... జీన్స్ తమాషాగా వుంది. చక్రాల్లాటి ఆ కళ్ళల్లో ఎంతో మెరుపు. మనిషినిండా అతి చురుకుతనం. ఆ పాప వాటమే చెబుతూంది రణపెంకీ, రాలుగాయీ అని. నాకు పిల్లల అల్లరంటే చాలా సరదా. ఆ పాపని టక్కున ఎత్తేసుకుని బుగ్గల మీద ముద్దు పెట్టేసుకునేవాడినే – కాని...

"ఏమిటి?" అంటూ పాపవేపు తిరిగాడు బ్రెడ్ కొంటున్న ఆమె డాడీ...

"ఆ బొమ్మ కొనియ్" యువరాణిగారార్డరు వేసినట్లే... షోకేసులోకి చూపిస్తూ.

"ఏది? ఆ కోతి బొమ్మా?"

"కోతీగీతీ అనకు, రఫ్ఫాడించీగల్ను. అది నా ఫ్రెండ్...."

నేను కొంచెం తెల్లబోయాను. ఆ పాప... ఆ మాట...

"అది చిన్న బొమ్మ కదా డాళింగ్? సాయంత్రం పెద్ద బజారుకెళ్ళి పేద్ద బొమ్మ తెస్తాను. ప్లీజ్... బేబీ..." బ్రతిమాలుతున్నట్లే అన్నాడా డాడీ.

వరమిచ్చే దేవతలా ఒక్కసారి ప్రసన్నవదన భంగిమ పెట్టి "ఓ.కె." అని అంతలోనే బోరవిరిచి మెడా వెన్నూ కొంచెం వెనక్కి వొంచి ఎడమ చెయ్యి నడుముకానించి... కుడిచేతిని ఎత్తి – చూపుడు వేలుతో, పిస్తోలులా, తండ్రి వేపు గురి చూస్తూ "సరే! ఇప్పటి కూరుకుంటాను. సాయంత్రం కాని పెద్ద బొమ్మని తేక పోయావో – స్టోరీ మారిపోద్ది" జాగ్రత్త అని బెదిరిస్తున్నట్టు చిరంజీవి పిక్చర్‌లో హీరోలా యమ సీరియస్‌గానూ, నిర్లక్ష్యంగానూ అంది.

ఒక్క క్షణం ప్రేక్షకులకి మతిపోయింది. అప్పుడు తేరుకుని బేకరీ వాడూ, నేనూ, ఆ డాడీ ఒక్కసారే ఫక్కున నవ్వేశాం ఆపుకోలేక. సమయానికి వి.సి.ఆర్.కాని వుంటే ఆ సీన్‌ని డైలాగ్‌తో సహా రికార్డ్ చేసుకుని దాచుకునేవాడినే.

ఆ డాడీ సిగ్గుపడిపోతూనే... "మా యింట్లో చిరంజీవి సినిమా కాసెట్లెక్కువ చూస్తామండీ. ఈ లిటిల్ డెవిల్‌రాస్కెల్ కిరవైనాలుగ్గంటలూ ఆ సినిమాలే. స్కూల్లో పడేస్తే కాని..." దీని అల్లరి కట్టదన్నట్టు చూశాడు.

టక్కున వొచ్చేసింది జవాబు "ఏడిశావ్?" అవమానం సహించనంటున్నట్లే... ఆ పాప నోటినుంచి ఎంతో పొంతనగా. ఆ పెంకితనానికి మళ్ళీ నవ్వుకుని ఆ సిసింద్రీని మరోసారి ముచ్చటగా చూసుకుని. మురిసిపోతూ బుగ్గలు నిమిరి "భామమ తంతటిదానవుకా" అని మనసులోనే ఆశీర్వదించి, సిగరెట్లు తీసుకుని కదిలాను రోడ్డుమీదకి

ఇప్పుడు నా మనసు కలత తీరి... తేటబారి, హాయిగావుంది. కడుపులో అరటిపండు పిసుక్కున్నట్లూ, మంచులోనూ వెన్నెల్లోనూ స్నానం చేస్తున్నట్లూ హాయిగావుంది. సంతోషంగానూ నిర్భయంగానూవుంది. నా భయాలూ, బాధాపోయి గొప్ప ఆశాభావం తళుక్కుమంటూ పొద్దున్నే దీపావళి వెలుగులు సాక్షాత్కరిస్తున్నట్టు అనిపించింది.

మరేమీఫరవాలేదు జాతికీ భవిష్యత్తుకీ. ఈ తరం వాళ్ళకి అక్షరాల చదువు తక్కువేమో కాని – అత్యవసరమయిన బతుకు నెగ్గుకు రావడంలోని ప్రతిభా పాటవాలు మాత్రం చాలా ఎక్కువ. వెనుకటితరంకంటే ఈ తరానికే చురుకూ తెలివి తేటలూ ఎక్కువ. ఈ రేపటి పౌరుల చేతుల్లో దేశం ఏమీ ఐపోదు సరికదా, సురక్షితంగానూ.. గలగల నవ్వుతూ చల్లగానూ వుంటుంది.

## ◑ ఎర్రకోట అమావాస్య

గోధూళి చిదిమిన స్మృతుల్ని చదువుకుంటున్నా
చీకటి కావ్యంలో–
ఆకాశం తప్పెట మోస్తున్న నిశ్శబ్దాన్ని వింటున్నా
ఎప్పుడో చదివిన కథల్లో పాత్రల చిన్నెల్లా
కథల కొసమెరుపుల్లాంటి నక్షత్రాలు
నా వాక్యాల్లో కురుస్తున్నాయి అగ్న్యక్షరాలు–
గుండె మీద ఎర్ర జండాలను చింపేస్తున్నాయి
గుడి మీద కాషాయ జండాలు ఎగురవేస్తున్నాయి
నా ముద్ద మీద వాలే గద్దలు–
దొంగ చేతుల్లో వజ్రంలా ఆ పౌర్ణమి
ఆ దొంగ దాహంలా ఈ అమావాస్య
ఎలా నెరవేరుతాయి కోర్కెలు ఈ తమస్సులో?
ఎలా వెలుగుతాయి దీపాలు ఎర్రకోట మీద గబ్బిలాలు
ఎగురుతుంటే?

మండి మండి నా రక్తం చెమటైపోయింది
అరచి అరచి నా గొంతు బావి గిలకైపోయింది
ఇప్పుడు మరో అవమానపు కక్ష్యలోపడి పరిభ్రమిస్తున్నా
నేనెప్పుడూ ముళ్ళ కంచె మీద పరచిన పట్టు వస్త్రాన్నని–
తెలుసుకున్నా–

– సాత్యకి